ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్

అతిథులెక్కువ.. వసతులు తక్కువ..!

◆ సైబేరియన్ పక్షులకు తప్పని తిప్పలు ◆ అటవీశాఖ చోద్యం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జనవరి వచ్చిందంటే చాలు సైబేరియన్ పక్షులు అతిథుల్లాగా ఈ ప్రాంతానికి విచ్చేస్తాయి. తిరిగి వర్షాకాలం మొదలవగానే మరో ప్రాంతానికి పయనమై వెళ్లిపోతాయి. అందుకే ఈ ప్రాంతానికి వచ్చే అతిథులుగా పక్షులను పిలుచుకుంటూ ఉంటారు. సత్యసాయి జిల్లాలోని చిలమత్తూరు మండలంలోని వీరాపురం సైబేరియన్ పక్షుల విడిది కేంద్రంగా పిలుచుకుంటారు. ఈ పక్షులు సైబేరియన్ ప్రాంతం నుంచి వస్తాయని చెబుతున్నప్పటికీ కచ్చితంగా అక్కడి నుంచే అని చెప్పలేం. దేశంలోనే ఇతర ప్రాంతాల నుంచి వస్తున్నట్టుగా పర్యావరణవేత్తలు చెబుతుంటారు. పెద్ద ఎత్తున పక్షుల వలన ఈ ప్రాంతం పర్యాటక కేంద్రంగానూ ప్రసిద్ధి. పెద్ద సంఖ్యలోనే పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు వచ్చి వీటిని చూసి వెలుతుంటారు.

ఈ ఏడాది అధికంగా వచ్చిన పక్షులు

వరుసగా రెండు సంవత్సరాలుగా జిల్లాలో మంచి వర్షాలు పడ్డాయి. దీంతో పక్షులు విడిది ఉండే చిలమత్తూరు మండలంలోనూ వీరాపురం, వెంకటాపురం చెరువుల్లోనూ నీరు పుష్కలంగా ఉంది. నీరు పుష్కలంగా ఉండటంతో ఈ ఏడాది పక్షులు కూడా ఎక్కువగానే ఇక్కడికి వచ్చినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. సాధారణంగా రెండు వేల వరకు వచ్చే పక్షులు ఈసారి నాలుగు వేలకుపైగా వచ్చాయి. ఈ పక్షులు సాధారణంగా ప్రాంతానికి జనవరి నెలలో వస్తాయి. వచ్చి చెట్లపైనా గూళ్లు ఏర్పాటు చేసుకుని వాటిల్లో గుడ్లు పెట్టి పొదుగుతాయి. ఈ పక్షులకు కొంత పెద్దగా అయిన తరువాత జూన్ నుంచి జులై మాసంలో తిరిగి పయనమైపోతాయి. ఒక్కో పక్షి సగటున నాలుగైదు గుడ్లు పెడుతుంది. వీటిల్లో మూడు పక్షల వరకు పొదుగుతుంది. ఈ రకంగా ఈ ఏడాది

సైబీరియన్ పక్షి

పిల్ల, పెద్ద పక్షులు అన్నీ కలిపి పది వేల వరకు అయినట్టు అంచనా. ఇంత పెద్దఎత్తున పక్షులు రావడం ఒకింత సంతోషించదగ్గ విషయం కాగా వాటి ఆహార సమస్య, సంరక్షణ సమస్యగా మారింది.

ఆహారం సరిపడక పక్షుల అరణ్యరోదన

పిల్లలను పొదిగి పెద్దగ చేసే క్రమంలో ఆహారం అధికంగా పక్షులకు అవసరమవుతోంది. ఒక్కో పక్షికి సగటున 500 గ్రాముల వరకు ఆహారాన్ని తీసుకుంటుంది. ఇందులో 90 శాతం వరకు చేపలే ఉంటాయి. తక్కినవి చూస్తే కప్పలు, పాములూ ఉంటాయి. పక్షులు ఈ ఏడాది అధిక కావడంతో ఆహారం కొరత సమస్య వాటికి ఏర్పడుతోంది. దీంతో ఆహారం లేక కొన్ని పక్షులు ఎగరలేక కిందపడిపోతున్నాయి. వీటి సంరక్షణ చేపట్టాల్సిన బాధ్యత అటవీ శాఖ చూడాల్సి ఉంది. కాని అటవీశాఖకు నిధుల కొరత వెంటాడుతున్నట్టు సమాచారం. దీంతో పక్షుల సంరక్షణ ఆగమ్య గోచరంగానే మారింది. దీని కోసం ప్రత్యేకంగా నియమించిన వేణుగోపాల్‌రెడ్డి అనే వాచ్ వార్డుయే ప్రకృతి ప్రేమికుల సహకారంతో వాటిని సంరక్షించే బాధ్యత చూస్తున్నారు. గతంలో వీటి సంరక్షణ కోసం రూ.80 లక్షలతో ప్రత్యేక ప్యాకేజీ కోసం ప్రతిపాదనలు పంపారు.



పెన్షన్ ఉద్యోగుల హక్కు

రాజకీయ నాయకులకు ఇచ్చే ప్రభుత్వం.. ఉద్యోగులకు ఇవ్వలేదా..!
సిఐటియు జిల్లా కార్యదర్శి ఈఎస్ వెంకటేష్

ప్రజాశక్తి-పుట్టపర్తిరూరల్

ఉద్యోగులకు హక్కు అయిన పింఛన్‌ను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఇది దుర్మార్గమైన చర్యని సిఐటియు శ్రీ సత్యసాయి జిల్లా కార్యదర్శి ఈఎస్.వెంకటేష్ తెలిపారు. ఏపీ జెఎసి అమరావతి రాష్ట్ర కమిటీ ఉద్యమ పిలుపు మేరకు శనివారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ఏపీ జెఎసి సత్యసాయి జిల్లా అధ్యక్షుడు మైనుద్దీన్, జిల్లా కార్యదర్శి జివైపి రావు అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వీరికి ధర్నాకు సిఐటియు మద్దతు తెలిపింది. ఈసందర్భంగా ఇఎస్.వెంకటేశలు మాట్లాడుతూ ఉద్యోగులు న్యాయమైన డిమాండ్ల సాధనకు ఆందోళనలు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వాలు వెంటనే వీటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాజకీయ నాయకులు పెన్షన్లు తీసుకుంటూ, ఉద్యోగులకు తొలగించడం దుర్మార్గం అన్నారు. మైనుద్దీన్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల్లో సింగిల్‌విండో విధానంతో ప్రజలకు ఎన్నో సౌకర్యాలు చేకూర్చాలని చేపట్టిన పథకం మంచిదేనని, కాకపోతే ఆ సచివాలయాల ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి బాగాలేదన్నారు. సంబంధం లేని పనులన్నిటినీ వారిపై రుద్ది వారితో వెట్టిచాకిరీ చేయిస్తున్నారన్నారు. అన్ని శాఖల్లో ఉద్యోగుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. స్టేషనరీ సైతం ఉద్యోగులే కొంటున్నారన్నారన్నారు. మూడు డీఏలు, 2018, 2019 అరియర్స్ పెండింగ్‌లో ఉన్నాయని, దాదాపు 20ఏళ్ల నుంచా చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. వార్డు సచివాలయ సిబ్బంది సమస్యలపై శనివారం కలెక్టరేట్ల వద్ద ధర్నా చేపట్టగా నిర్వీర్యం చేయడానికి వార్డు సచివాలయ ఉద్యోగులను ఇందులో పాల్గొనకుండా అదనపు పనులను వారికి అప్పజెప్పడం దుర్మార్గం ఉందని మండిపడ్డారు. ప్రభుత్వం ఇలాంటి చర్యలకు స్వస్తి పలికి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెఎసి కార్యదర్శి పద్మనాభం, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా సివిపి ఆర్ఎస్ రెడ్డి, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం చౌడప్ప, ఆర్టీసీ ఉద్యోగులు రామంజి, సుధాకర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు చంద్ర, జిల్లాలోని అన్ని విభాగాల ఉద్యోగ సంఘ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతం

ప్రజాశక్తి-లేపాక్షి

మండల కేంద్రంలోని జవహర్ నవోదయ పాఠశాలకు దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రవేశ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. 6వ తరగతి ప్రవేశ పరీక్షకు ఉమ్మడి అనంతపురం జిల్లా సత్యసాయి, అనంతపురం జిల్లాలకు సంబందించిన 13 బ్లాకుల నుంచి 42 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాయడానికి మొత్తం 8774 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా అందులో 2896 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు అయ్యారని ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు.

లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బికె.పార్థసారథి, పల్లె రఘునాథరెడ్డి, సవితమ్మ

లోకేష్ పాదయాత్రలో బికె, పల్లె, సవితమ్మ

ప్రజాశక్తి -పెనుకొండ

టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర కర్నూల్ జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గం నందవరంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా నారా లోకేష్‌ను టీడీపీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు పెనుకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.కె.పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. వర్షంలో లోకేష్ వెంట పాదయాత్రలో నడిచారు.

లోకేష్‌ను కలిసిన సవితమ్మ

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సవితమ్మ శనివారం కలిశారు. కర్నూల్ జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గం నందవరం క్యాంప్ వద్ద లోకేష్‌ను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుముందు మంత్రాలయం రాఘవేంద్రస్వామిని ఆమె దర్శించుకున్నారు. ఆమె వెంట పెనుకొండ టీడీపీ నాయకులు ఉన్నారు.

వైసిపి నేతల బైక్ ర్యాలీ

ప్రజాశక్తి -పెనుకొండ

మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ముగింపు సందర్భంగా శనివారం నాడు పెనుకొండలో శ్రీసత్యసాయి జిల్లా వైసిపి అధ్యక్షులు, ఎమ్మెల్యే శంకర్ నారాయణ ఆధ్వర్యంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి వైసిపి నాయకులు ఘన నివాళుర్పించారు. అనంతరం పట్టణ పురవీధుల్లో వైసిపి శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్ జైలును తనిఖీ చేసిన ఎడిజె

హిందూపురం : పట్టణంలోని సబ్ జైలును అదనపు జిల్లా జడ్జి శైలజ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న ఖైదీల వివరాలను సూపరెంటెండెంట్ చంద్రశేఖర్‌తో అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం సబ్ జైల్లో ఉన్న ఖైదీలు ఏయే నేరాలు చేసి వచ్చారు, న్యాయవాదులను ఏర్పాటు చేసుకున్నారా, బెయిల్ మంజూరు అయిందా..? అన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నో నెలలుగా జైలులో ఉంటున్న ఖైదీల గురించి ప్రత్యేకంగా చర్చించారు. ఖైదీలు జైలులో తమ ప్రవర్తన మార్చుకునేలా చూడాలని జైలు సిబ్బందికి సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సంతోషి కుమారి, నవేరా, పవిత్ర, లోక అదాలత్ హేమావతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సంప్రోక్షణ వేడుకలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని దుర్గమ్మ దేవస్థానంలో ఈ నెల 27 నుంచి 29 వరకూ ఆలయ ఈవో వెంకటేశులు, అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పర్వతయ్య, దాతలు, భక్తుల సహకారంతో నిర్వహించిన సంప్రోక్షణ వేడుకలు ముగిశాయి. ఇందులో భాగంగా శనివారం దుర్గమ్మను పట్టు వస్త్రాలు, వివిధ ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. తితిదే వేద పాఠశాల నుంచి వచ్చిన రామకష్ణ శర్మ, ఫణీంద్ర, సురేష్, రవీంద్రనాథ్, నాగసాయి, లోకనాథ శర్మ, శ్రీచంద్రన్‌లచే వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ సంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు అమ్మవారికి పంచామతాభిషేకం, పూర్ణాహుతి, కూష్మాండ బలి, తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికి పూజలు చేయించారు. ఉభయ దాతలచే ఉదయం హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

జెఈఈ మెయిన్స్‌లో మెరిసిన గణేష్

హిందూపురం : జాతీయ స్థాయిలో నిర్వహించిన జెఈఈ పరీక్షా ఫలితాలను శనివారం విడుదల చేశారు. ఈ ఫలితాల్లో పట్టణంలోని సువర్ణభారతి జూనియర్ కళాశాలకు చెందిన సీనియర్ ఇంటర్ ఎంపిసి విద్యార్థి అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నీలకంఠరెడ్డి పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో జరిగిన జెఈఈ మెయిన్స్ పరీక్షల్లో గణేష్ పాల్గొని 94.87 స్కోర్ తో జాతీయ స్థాయిలో 16,797 ర్యాంకు సాధించారన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థి గణేష్‌ను ప్రిన్సిపల్‌తో పాటు ఎఒ అనీల్, అధ్యాపకులు అభినందించారు.

గణేష్

జనంలో జగన్‌పై పూర్తి నమ్మకం

ఎమ్మెల్సీ మొహమ్మద్ ఇక్బాల్

ప్రజాశక్తి-హిందూపురం

జనంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిపై అపార నమ్మకం ఉందన్న విషయాన్ని పీపుల్స్ సర్వే ద్వారా వెల్లడి అయ్యిందని ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ పేర్కొన్నారు. జగనన్నే మా భవిష్యత్తు మెగా పీపుల్స్ సర్వే కార్యక్రమం విజయవంతం అయిన సందర్భంగా శనివారం నియోజక వర్గ ఇన్‌ఛార్జ్, ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించి, బెంగళూరు రోడ్డులో ఉన్నా ఆర్‌కె ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకున్నారు. అక్కడ నాయకులు, కార్యకర్తలతో సమావేశం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇక్బాల్ మాట్లాడుతూ జగన్ నాయకత్వం మీద రాష్ట్ర ప్రజలు పూర్తి సంతోషంగా ఉన్నారు. ఈ సర్వేతో వైఎస్సార్‌సీపీ రాజకీయంగా బలంగా ఉందని నిరూపణ అయ్యిందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా కూడా ప్రభుత్వం చేస్తున్న అభివద్ధి మీద ప్రజల అభిప్రాయం తెలుసుకుంటున్నామని చెప్పారు. హిందూపురం నియోజక వర్గంలో 93 వేల గృహాలు ఉంటే 86,220 గృహాలను సర్వే చేశామన్నారు. ఏ గడపకు వెళ్లినా ప్రభుత్వ పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని, మాజీ వైసిపి సమయనకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, లేపాక్షి మండల కన్వీనర్ నారాయణస్వామి, వైస్ ఛైర్మన్ జబివుల్లా, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉపేందర్ రెడ్డి, మండల నాయకులు బసిరెడ్డి, ఎంపీపీలు, జడ్పిటిసిలు నాగభూషణం, బాణాల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ మొహ్మద్ ఇక్బాల్

అలా ప్రారంభించారు.. ఇలా ముగించారు..!

- ◆ ఛైర్‌పర్సన్, ముఖ్య ప్రజా ప్రతినిధిపై అధికార పక్షం సభ్యుల ఆగ్రహం
- ◆ అవినీతిపై విచారణ చేయాలని డిమాండ్
- ◆ స్థానిక పాలనతోనే అభివృద్ధి : వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి

ప్రజాశకిత-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన జరిగింది. సమావేశం ప్రారంభానికి ముందే అధికార పార్టీలో అసమ్మతి కౌన్సిలర్లు మున్సిపల్ రెండవ వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి ఛాంబర్‌లో సమావేశమయ్యారు. సమావేశం ప్రారంభ సమయంలో అసమ్మతి కౌన్సిలర్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ అవినీతి, విద్యుత్ దీపాల కొనుగోలులో జరిగిన అవినీతి, మున్సిపల్ ముఖ్య ప్రజా ప్రతినిధి భూకబ్జా, రైల్వే రోడ్డు విస్తరణ పనులు, మార్కెట్ తదితర అంశాలపై ప్లకార్డులను ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ నల్ల బ్యాడ్జీలను ధరించి సమావేశానికి వచ్చారు. దీనిని గమనించిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ కౌన్సిల్ సమావేశంలో రచ్చ జరుగుతుందని తెలిసి అజెండాలోని అంశాలన్నింటినీ ఆమోదం తెలుపుతున్నట్లు మిగిలిన అధికార పార్టీ కౌన్సిలర్లతో ఆమోదం తీసుకుని, సమావేశం పూర్తి అయిందని చెప్పి వెళ్లిపోయారు. దీంతో ఆగ్రహించిన అధికార పార్టీ అసమతి కౌన్సిలర్లు కౌన్సిల్ హాల్‌కు తలుపులు వేసి అవినీతిపై చర్చ జరగకుండా బయటకు వెళ్లకూడదని పట్టుబట్టారు. ప్రతిపక్ష కౌన్సిలర్లు ప్రజా సమస్యలపై చర్చించాలని, అజెండాలోని అంశాలపై చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ ఛైర్‌పర్సన్ పోడియం ముందు బైఠాయించి నినాదాలు చేశారు. అధికార పార్టీ అసమ్మతి కౌన్సిలర్లు శివ, ఆసిఫ్ తదితరులు కౌన్సిల్ ఏర్పడి రెండు సంవత్సరాలు నుంచి పురపాలక సంఘ కార్యాలయంలో అన్ని విభాగాల్లోనూ అవినీతి రాజ్యమేలుతుందన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని మున్సిపల్ ముఖ్య ప్రజాప్రతినిధి భూ కబ్జాలకు పాల్పడుతున్నారు. పురపాలక సంఘంలో అభివద్ధి పనులను చేపడుతున్న గుత్తేదారుల నుంచి మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ పెద్ద ఎత్తున కమీషన్‌లు తీసుకుంటుందని ఆరోపించారు. అందుకోసమే గుత్తేదారులు అభివద్ధి పనులు చేయడానికి ఏ ఒక్కరు ముందుకు రావడం లేదన్నారు. నాడు విపక్షంలో ఉన్నప్పుడు వివక్షను చూపి వార్డుల అభివద్ధికి నిధులు కేటాయించలేదని, నేడు అసమ్మతిలో ఉన్నామన్న కారణంతో నిధులు కేటాయించకుండా వివక్ష చూపుతున్నారన్నారు. వీధిదీపాల కోసం కొనుగోలు చేసిన ఎల్‌ఈడి దీపాల్లో లక్షలాది రూపాయలు అవినీతి జరిగిందని దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్లు కనీస చర్చ లేకుండానే అజెండాలోని అంశాలను ఎలా ఆమోదిస్తారని. ప్రజా సమస్యలపై చర్చించకుండానే సమావేశాన్ని ఎలా ముగిస్తారన్నారు. ప్రజా సమస్యలపై చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ ఛైర్‌పర్సన్ పోడియం ముందు బైఠాయించి నినాదాలు చేశారు. వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు స్థానికులు అయితేనే అభివద్ధి సాధ్యమవుతుందన్నారు. హిందూపురం నుంచి ఎన్టీఆర్, ఆయన కుమారుడు బాలకృష్ణలు ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించినా ఈ ప్రాంతానికి చేసిన అభివృద్ధి శూన్యం అన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ శాసన సభ్యుడిగా హిందూపురం పురపాలక సంఘంతో పాటు నియోజకవర్గాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. ఇక కౌన్సిల్‌లో అధికార పార్టీ సభ్యుల నిరసనపై అసంతప్తిని వ్యక్తం చేశారు.

ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న వైసిపి అసమ్మతి కౌన్సిలర్లు

రక్తహీనత నివారణకు సంపూర్ణ పోషకాహార పథకం

కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

గర్భిణులు, బాలింతలు రక్తహీనతకు లోనుకాకుండా సంపూర్ణ పౌష్టికాహారం తీసుకోవాలని, అందుకు అంగనవాడీ కేంద్రాలు కషి చేయాలని కలెక్టర్ అరుణ్ బాబు సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లాలో ఐసిడిఎస్, అంగనవాడీ కేంద్రాల పనితీరు, పౌష్టికాహారం, తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రభుత్వం వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ ప్లస్ పథకం అమలు చేస్తోందన్నారు. సిడిపిఓలు రోజూ రెండు మండలాలను పర్యవేక్షించి అంగనవాడి కేంద్రాల పనితీరుపై నివేదికలు పిడికి అందజేయాలన్నారు. సుస్థిర అభివద్ధి లక్ష్యాలతో రాబోయే 7 రోజుల్లోపు మన జిల్లా ముందు వరుసలో ఉండాలని అధికారులను ఆదేశించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడమే ఈ పథకం ఉద్దేశమన్నారు. గర్భిణులు తీసుకునే ఆహారంపైనే పుట్టబోయే బిడ్డ ఎదుగుదల,ఆరోగ్యం ఆధారపడి ఉంటుందన్నారు. రక్తహీనతతో బాధపడే మహిళల కోసం వారి సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయంగా ఐసిడిఎస్ సిబ్బంది కషి చేయాలన్నారు. సంబంధిత సూపర్వైజర్లు ప్రతిరోజూ అంగనవాడి కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. 0-5 ఏళ్ల చిన్నపిల్లల ఆధార్ నమోదును వేగవంతం చేయాలన్నారు. కౌమార దశలో అమ్మాయిలు, పిల్లల ఎదుగుదల లోపం గల వారి పట్ల ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే సరుకులు నాణ్యత పై దష్టి పెట్టాలన్నారు. అంగనవాడి కేంద్రాల పనితీరుపై ఎంపీడీవోలకు కలెక్టరు కొన్ని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఓ విజయ్ కుమార్, వార్డు సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి, ఐసిడిఎస్ పిడి లక్ష్మి కుమారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మత్తు మాదక ద్రవ్యాల నియంత్రణపై మాట్లాడుతున్న కలెక్టర్

డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలి:కలెక్టరు అరుణ్ బాబు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చాలని ఆదేశించారని, అందులో భాగంగా శ్రీసత్యసాయి జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడానికి అధికారులు కషి చేయాలని కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం మత్తు పదార్థాలు-మారకద్రవ్యాల నివారణపై ఎస్ పి మాధవరెడ్డి, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోకి మత్తు పదార్థాలు సరఫరా కాకుండా కర్ణాటక సరిహద్దు మండలాల్లో గట్టి నిఘా పెట్టాలన్నారు. బెంగళూరు దగ్గరగా ఉండటంతో కార్మికులు రాకపోకలు పుట్టపర్తికి దేశ, విదేశీ భక్తులు వస్తుంటారని మత్తు పదార్థాలు వినియోగించే అవకాశం ఉండడంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. పాఠశాలల్లో కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాలు వాడకంపై జరిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రజలకు అవగాహన నిమిత్తం రద్దీగా ఉన్న ప్రాంతాల్లో బోర్డుల ద్వారా ప్రచారం నిర్వహించాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమల అధికారులు ఎక్కడైనా గంజాయి సాగు చేస్తే సమాచారం అందించాలని కోరారు. ఎస్ పి మాధవరెడ్డి మాట్లాడుతూ, మత్తు పదార్థాలు వాడకుండా వాటిని అరికట్టడానికి ప్రతి అధికారి కషి చేయాలన్నారు. అవగాహన సదస్సులు, ప్రచార గోడ పత్రికలు వల్ల విస్తతంగా ప్రచారం చేయాలన్నారు. ఎవరైనా డ్రగ్స్ వాడుతున్న ఇతర సమస్యలకు 14500 టోల్ ఫ్రీ కి ఫోన్ చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్ పి రామకష్ణ ప్రసాద్, సెబ్ ఎస్ పి రవికుమార్, డి ఎస్ పి లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ఆదాయం పెంచుతాం

ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి
మాలగుండ్ల పెద్దయ్య షాపింగ్ కాంప్లెక్స్‌కు భూమిపూజ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని ప్రధాన వీధుల్లో మున్సిపల్ కాంప్లెక్సులు నిర్మించి మున్సిపాలిటీకి ఆదాయం చేకూరుస్తున్నామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్‌లో రూ.1.5 కోట్లతో గుడ్ విల్ వేలం ద్వారా నూతనంగా నిర్మించబోయే 17 గదుల మున్సిపల్ కమర్షియల్ కాంప్లెక్స్ భవన నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సెంటు రూ. 30 లక్షలకు పైగా ఉండే ఈ ప్రాంతంలో మున్సిపాలిటీ గుడ్ విల్ వేలం కింద తక్కువ డబ్బుకు గదులను అందిస్తుందన్నారు. కాయగూరల మార్కెట్లో నిర్మించిన గదులకు సైతం ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. ఈ నూతన భవన కాంప్లెక్స్‌కు మున్సిపల్ మాజీ ఛైర్మన్ మాలగుండ్ల వకీలు పెద్దయ్య పేరు పెడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, మున్సిపల్ ఛైర్పర్సన్ లింగం నిర్మల, వైస్ ఛైర్మన్ పెనుజూరు నాగరాజు, సచివాలయాల కన్వీనర్లుచందమూరు నారాయణరెడ్డి,మాసపల్లి సాయికుమార్, కౌన్సిలర్లు, వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

ప్రజాశక్తి
www.prajasakti.com

రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి

పుట్టపర్తిరూరల్:రేషన్ బియ్యాన్ని ఎండియు వాహనాల ద్వారా ప్రతి గ్రామంలో ఇంటి వద్దకే వెళ్లి ప్రజలకు పంపిణీ చేయాలని, అలా చేయని వారిపై చర్యలు తీసుకుంటామని సివిల్‌సప్లై డిటి షబ్బుం హెచ్చరించారు. ఆమె శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని డీలర్లు, ఎండియు వాహనాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ డీలర్లు ప్రతి నెలా క్రమం తప్పకుండా డిడిలు తీయాలని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలకు పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని సకాలంలో అందించాలని సూచించారు. ఏ డీలరైనా సకాలంలో రేషన్ అందించకుంటే తనిఖీలు నిర్వహించి సంబంధిత రిపోర్టును ఆర్డీవో ముందు ఉంచుతామని, చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిత్యావసర సరుకులను కార్డుదారుల వద్దకే వెళ్లి అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

గ్రామాల్లో 'మా నమ్మకం నువ్వే జగనన్న'

ఓబులదేవరచెరువు:'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని చింతమానుపల్లి సచివాలయ పరిధిలోని అల్లి మియాపల్లి, నాయనవారిపల్లి, కాటంరెడ్డిపల్లి, బొమ్మిరెడ్డి చెరువు, మల్లెం వాండ్లపల్లి, తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి గడప గడపకూ వెళ్లి సమస్యలు తెలుసుకొని పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలు, అందించిన లబ్ది గురించి వాలంటీర్లు ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల టౌన్ కన్వీనర్ కోళ్ల కష్టారెడ్డి, మండల కన్వీనర్ రాజు నాయుడు, జడ్పిటిసి కుర్ర దామోదర్ రెడ్డి, ఎంపీపీ పర్వీన్ బాను, మార్కెట్ యార్డు ఛైర్మన్ శ్రీనివాసులు, సర్పంచులు జగన్నాథ్ చౌదరి, రఫిక్, మజీద్, షామీర్ బాషా, లక్ష్మిరెడ్డి, భాస్కర్ రెడ్డి, మండల ఆరిఫ్ ఖాన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాక్షస పాలనపై తిరుగుబాటు మొదలైంది

రొద్దం:రాష్ట్రంలో రాక్షస పాలనపై తిరుగుబాటు మొదలైందని టిడిపి నాయకులు పేర్కొన్నారు. 'ఇదేమి ఖర్మ రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా శనివారం వారు మండలంలోని ఎలిజబి నగర్లో పర్యటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో చిన్నా, పెద్దా, ఆడ, మగ అనే తేడా లేకుండా కక్ష సాధింపు చర్యలతో రాక్షస పాలన సాగిస్తున్నారని, దీంతో ప్రజలు ఏకమై ప్రభుత్వం, నాయకులపై తిరగబాటుకు సిద్ధమయ్యారని తెలిపారు. అలాగే టిడిపి చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు హారతులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగేంద్ర, నాయకులు ప్రకాష్ రెడ్డి, ఆనందరెడ్డి, రామిరెడ్డి, అంజనేయులు, అంజినప్ప, వడ్డీ వెంకటేశులు, నాగభూషణ, గొల్ల నాగభూషణ, ఈడిగ ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎంపీడీవోలతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్

పుట్టపర్తి రూరల్:గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్య సిబ్బంది పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించి సుస్థిర అభివద్ధి, లక్ష సాధనకు కషి చేయాలని శనివారం కలెక్టర్ అరుణ బాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీవోలకు సూచించారు. అందులో పుట్టపర్తి, బుక్కపట్నం ఎంపీడీవోలు అశోక్ కుమార్ రెడ్డి, శ్రీనివాసులు, ఎంఈఓ వెంకటరమణ నాయక్, ఏఎస్ఓ హర్షవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో 0-5 ఏళ్ల లోపు పిల్లలకు మహిళా పోలీసుల ద్వారా ఆధార్ అప్డేషన్ ప్రక్రియ చేపట్టే విధంగా చూడాలని సూచించినట్లు తెలిపారు. అలాగే 6-19 ఏళ్ల వారికి గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, గర్భిణులకు సంబంధించి అంగన్వాడీ కార్యకర్తలు, బాలింతలకు సంబంధించి ఏఎన్ఎం ఈ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వీటి అప్డేట్స్ సత్వరమే నిర్వహించాలని కలెక్టర్ సూచించినట్లు ఎంపీడీవో లు తెలిపారు. అంతేకాక ఇంటి స్థలాలు, ఈకేవైసీ లను వాలంటీర్లు, కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు వారి ఇళ్ల వద్దకే వెళ్లి వాటిని అందజేయాలని సూచించినట్లు తెలిపారు.

1న సామాజిక పింఛన్ల పంపిణీ

పుట్టపర్తి రూరల్:మే 1వ తేదీ మండలంలో సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తారని ఎంపీడీవో అశోక్ కుమార్ రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బ్యాంకులకు వరుస సెలవులు ఉన్న కారణంగా గత నెల పింఛను సొమ్ము సకాలంలో అందించలేకపోయామన్నారు. ఈ నెల ఇప్పటికే గ్రామ వాలంటీర్లకు సొమ్ము అందజేశామని సోమవారం మండల వ్యాప్తంగా పది గ్రామ పంచాయతీల్లో 4,678 మందికి పంపిణీ చేస్తారని తెలిపారు. పింఛను సొమ్మును సక్రమంగా, సకాలంలో ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేయాలని గ్రామ వాలంటీర్లకు సూచించారు.

5 నుంచి క్రికెట్ టోర్నీ

బత్తలపల్లి:బత్తలపల్లిలో మే 5వ తేదీ నుంచి ఫ్రెండ్స్-11 క్రికెట్ టోర్నమెంటు పోటీలు నిర్వహిస్తున్నట్లు శనివారం నిర్వాహకులు రంగానాయుడు తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.1,666 చెల్లించి టోర్నీలో పాల్గొనాలన్నారు. విజేత జట్టుకు రూ. 55,555, రన్నర్స్ జట్టుకు రూ. 22,222, 3,4 స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.5,555 అందిస్తామన్నారు. మే 3వ తేదీ లోపు జట్టు పేరు నమోదు చేసుకోవాలన్నారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ ఉంటాయన్నారు. వేదిక బత్తలపల్లి తహశీల్దార్ కార్యాలయం దగ్గర ఉంటుందన్నారు. నిబంధనల ప్రకారం టోర్నీ జరుగుతుందన్నారు. ప్రతి జట్టు 15 మంది సభ్యుల పేర్లు, అందరి ఆధార్ కార్డులు ఇవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు కమిటీ సభ్యులు రంగానాయుడు (8919944800), ఓబుళనాయుడు (9398417117), శేషు (6281386087), నాగేంద్ర (8309063970), ప్రమోద్ (8374407790), రాము (9703040216) నెంబర్లలో సంప్రదించాలన్నారు.

పుట్టపర్తి కౌన్సిల్ సమావేశం రసాభాస

పుట్టపర్తిలో పరస్పరం వాదోపవాదనలు చేసుకొంటున్న అధికార, ప్రతిపక్ష సభ్యులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పుట్టపర్తి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య జరిగిన వాదోపవాదాలతో దద్దరిల్లింది. ఛైర్మన్ తుంగ ఓబుళపతి అధ్యక్షతన శనివారం సమావేశం జరిగింది. అజెండాలో వరుసగా పది కాంట్రాక్టు పనులు విశ్వనాథ్‌రెడ్డికే అప్పగించినట్లు చదువుతుండడంతో టిడిపి ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి అడ్డు తగిలారు. విశ్వనాథరెడ్డి కేవలం ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి బంధువు కావడంతో కమిషనర్ కుమ్మక్కై అన్ని పనులు ఏకపక్షంగా ఒక్కరికే కట్టబెట్టారని ఆరోపించారు. కమిషనర్ వెంకట్రామిరెడ్డి జోక్యం చేసుకొని పత్రికలో యాడ్ ఇచ్చామని, ఆన్‌లైన్‌లో రాష్ట్రంలో ఎక్కడ నుంచైనా టెండర్ వేయవచ్చన్నారు. వ్యక్తిగత ఆరోపణలు చేయడం పద్ధతి కాదన్నారు. దీంట్లో రత్నప్ప చౌదరి ఆవేశంగా మాట్లాడుతూ నీవు ఎక్కడికైనా ఉద్యోగరీత్యా బదిలీ కావచ్చుని, కానీ ఇక్కడ ఉన్న ఛైర్మన్ మెడకు చుట్టుకొంటుందన్నారు. దీంతో అధికారపక్ష కౌన్సిలర్లు చెరువు భాస్కర్ రెడ్డి, సాయి గీత, వైస్ ఛైర్మన్ తిప్పన్న, సూర్య గౌడ్ మాట్లాడుతూ వ్యక్తిగత ఆరోపణలు చేయడం సరికాదని, రౌడీయిజం చేస్తూ సభా గౌరవాన్ని మంట కలుపుతున్నారని ప్రతిపక్ష కౌన్సిలర్లపై ధ్వజమెత్తారు. టిడిపి ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డుల్లో ఒక్క పనీ చేయలేదని ప్రతిపక్ష సభ్యులు మండిపడ్డారు. కమ్మవారిపల్లిలో తాగునీరు, వీధిలైట్లు, గోకులంలో లోపించిన పారిశుధ్యం, తదితర అంశాలను లేవనెత్తారు. అలాగే సమావేశాన్ని బహిష్కరించి వెళ్తుండగా అధికారపక్ష కౌన్సిలర్లు మూకుమ్మడిగా రత్నప్ప చౌదరి వ్యవహార శైలిని ఖండిస్తూ ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం తగదని వాదనకు దిగారు. ఇరుపక్షాల నాయకుల వాదోపవాదనలతో సమావేశం రసభాసగా మారింది. చివరికి ప్రతిపక్ష కౌన్సిలర్లు ఐదుగురు వాకౌట్ చేశారు. అనంతరం వివిధ పనులను కౌన్సిల్ సమావేశం ఆమోదం తెలిపింది.

కదిరి కౌన్సిల్‌లో పలు అంశాలకు ఆమోదం

కదిరి అర్బన్ : మున్సిపల్ ఛైర్‌పర్సన్ నజీమున్నీసా అధ్యక్షతన శనివారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో అజెండాలోని పలు అంశాలకు ఆమోదం లభించింది. అయితే మున్సిపల్ వైస్ ఛైర్మన్‌పై ఓ పత్రికలో వార్త ప్రచురితం కావడంపై వార్డు కౌన్సిలర్ మహమ్మద్ వ్యవహరించిన తీరును వ్యతిరేకిస్తూ పాత్రికేయులు కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఇదిలా ఉండగా మున్సిపాలిటీ పరిధిలోని పలు సమస్యలపై కౌన్సిలర్లు కమిషనర్‌ను నిలదీశారు. అందులో భాగంగా మెప్మాలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ రెడ్డిపై చర్యలు తీసుకోకపోవడంపై వైస్ ఛైర్‌పర్సన్ గంగాదేవి, కళ్యాణ్, మహమ్మద్ ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ హరిబాబు స్పందిస్తూ ప్రాజెక్టు డైరెక్టర్‌కి ఇప్పటికే ఫైలు పంపించామని తెలిపారు. 10వ వార్డు కౌన్సిలర్ దిల్షాద్ మాట్లాడుతూ అక్రమ వసూళ్లకు పాల్పడుతూ విధులను నిర్లక్ష్యం చేస్తున్న వారిని విడిచిపెట్టి, ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ సక్రమంగా విధులు నిర్వహిస్తున్న వాలంటీర్లను తొలగించడం ఏంటని కమిషనర్‌ను ప్రశ్నించారు. ప్రజల వద్ద ప్రతి పనికీ డబ్బు వసూలు చేయడంతో పాటు పదో వార్డులో పారిశుధ్యం పనులు చేపట్టలేదని కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. ఇకనైనా సక్రమంగా విధులు నిర్వహిస్తున్న వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవడంతో పాటు ప్రజల వద్ద అక్రమంగా వసూలు చేస్తున్న వాలంటీర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. పదో వార్డు సచివాలయంలో నిర్లక్ష్యంగా విధులను నిర్వహిస్తున్న వారిని వెంటనే బదిలీ చేసి కొత్త వ్యక్తులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. పేదలకు రెండో విడతలో మంజూరు చేసిన పక్కా గృహాల స్థలాన్ని చదును చేయడానికి, మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో సిమెంటు, కాంక్రీట్ రహదారులు, కాలువలు, కల్వర్టులు, పైపులైన్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కౌన్సిలర్లు ప్రతిపాదించగా కౌన్సిల్ ఆమోదం తెలిపింది. హిందూపూర్ కూడలి క్రాస్, ప్రధాన రహదారి వద్ద ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఉత్తర గోపురం, సింహం కోట వద్ద, తెలుగు ప్రధాన పాఠశాల వద్ద 4 కల్వర్టుల మరమ్మతులకు రూ. 5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు అజెండాలో తెలిపారు. విశ్రాంత సైనికోద్యోగి వినతి మేరకు ఆయన ఇంటికి పన్ను మినహాయింపును అజెండాలో తీర్మానించినట్లు తెలిపారు. 2019కి ముందు ఆ తర్వాత వేసిన అనధికార లేఔట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ఇబ్బందులు పడుతున్న యజమానులకు ఊరట కల్పిస్తూ నూతన భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయడానికి చర్యలు తీసుకున్నట్లు అజెండాలో తెలిపారు. కాగా ప్రతి కౌన్సిల్ సమావేశానికి వచ్చి పోతున్నాం తప్ప ఎలాంటి పనులు జరగలేదని అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లే చర్చించుకోవడం గమనార్హం. ఈ సమావేశంలో కమిషనర్ శ్రీహరి బాబు, అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కదిరి కౌన్సిల్ సమావేశంలో అభ్యంతరం వ్యక్తం చేస్తున్న సభ్యులు

మడకశిర కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

మడకశిరలో రచ్చ రచ్చ..

మడకశిర రూరల్ : మడకశిర నగర పంచాయతీ సాధారణ సమావేశం రచ్చరచ్చగా సాగింది. వాగ్వివాదాల మధ్య తూతూ మంత్రంగా ముగిసింది. మడకశిర నగర పంచాయతీ సమావేశ భవనంలో శనివారం ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అధికారులు వివిధ అంశాలను చదివి వినిపిస్తుండగా అధికార పార్టీకి చెందిన కొందరు, ప్రతిపక్ష టిడిపి కౌన్సిల్ సభ్యులు లేచి వారపు సంత, దినసరి మార్కెట్, బస్టాండ్‌లో వాహనాల సుంకం వసూలు గడువు మార్చి నెలకే ముగిసినా ఇంతవరకూ ఎందుకు బహిరంగ వేలాలు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో వాగ్వివాదం చోటుచేసుకుంది. టౌన్ ప్లానింగ్ అధికారి, కమిషనర్ కుమ్మక్కై నగర పంచాయతీలో ఇష్టారాజ్యంగా లేఔట్లు వేసి ప్లాట్లు విక్రయిస్తున్న వారి నుంచి డబ్బులు తీసుకొని అనుమతులు మంజూరు చేస్తున్నారని మండిపడ్డారు. మామూళ్లు, లేఔట్‌లో స్థలాలు ఇవ్వని లేఔట్ల యజమానులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 13వ వార్డు కౌన్సిలర్ సుజాత మాట్లాడుతు ఓ వ్యక్తి ప్రధాన రహదారి పక్కన టీ కొట్టు ఏర్పాటు చేసుకుంటే కమిషనర్ రూ. 5వేలు లంచం తీసుకున్నారని అసహనం వ్యక్తం చేస్తూ ఆమె సమావేశంలో నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేసింది. మున్సిపల్ కార్యాలయంలో అధికారుల అవినీతికి అడ్డూ అదుపూలేకుండా పోతుందని అధికార పార్టీ పాలకవర్గ సభ్యులే ఆరోపించడం విశేషం.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర నారాయణ

ప్రజల మద్దతు వైసిపికే..

అజ్ఞాని నారా లోకేష్:ఎమ్మెల్యే శంకర నారాయణ

ప్రజాశక్తి -పెనుకొండ

వైసిపి చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు' మెగా పీపుల్స్ సర్వేలో రాష్ట్రంలోని 1.45 కోట్ల కుటుంబాలను కలిసి జగన్ పాలనపై అభిప్రాయాలు సేకరించగా 1.1 కోట్ల కుటుంబాలు మిస్డ్ కాల్ ద్వారా మద్దతు ప్రకటించా యని ఎమ్మెల్యే శంకర నారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ మెగా సర్వేతో ప్రజల మద్దతు వైసిపికే ఉందని స్పష్టమైందని, జగన్ పాలనకు 80 శాతం మంది ప్రజలు అనుకూలంగా తీర్పు ఇచ్చారన్నారు. సీఎం జగన్ చేస్తున్న మంచికి ప్రజల్లో ఆమోదం, సంతృప్తి ఉందన్న విషయం తేలిందన్నారు. భావితరాలు కూడా రాష్ట్ర సర్వతోముఖాభివద్ధి సీఎం జగన్ తోనే సాధ్యమని నమ్ముతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 85శాతం పూర్తి చేశామని, 75 శాతం మంది వారి సెల్ ఫోన్ల నుంచి మిస్డ్ కాల్ ఇచ్చారన్నారు. 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి వస్తున్న స్పందనను చూసి చంద్రబాబు, లోకేష్ గుండెల్లో గుబులు పట్టుకుందన్నారు. 14ఏళ్ల సీఎంగా ఉన్న చంద్రబాబు ప్రజలకు ఏమి మంచి చేశారో, చేస్తారో చెప్పాలన్నారు. కురుబలకు, యాదవుల కు తేడా తెలియని అజ్ఞాని లోకేష్ అంటూ విరుచుకు పడ్డారు. బీసీల గురించి మాట్లాడేటప్పుడు చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఏమి చేశారో చెప్పాలన్నారు. సీఎం జగన్ అన్ని కులాలకు న్యాయం చేసే విధంగా 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఛైర్మన్లు,700మంది డైరెక్టర్లను నియమించారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నాగలూరు బాబు, టౌన్ కన్వీనర్ నరసింహ, నగర పంచాయతీ ఛైర్ పర్సన్ ఫరూక్, వైస్ ఛైర్మన్ సునీల్, కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి, వైస్ ఎంపీపీ రామాంజనేయులు, నాయకులు కొండలరాయుడు, గోపాల్ రెడ్డి, సచివాలయ కన్వీనర్లు సమరసింహారెడ్డి, శ్యామ్ నాయక్, ఇమామ్ గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'నాడు-నేడు' పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి

జాయింట్ కలెక్టర్ చేతన్

మాట్లాడుతున్న జెసి చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

నాడు-నేడు పనులపై ప్రత్యేక దష్టి పెట్టి, సకాలంలో పూర్తి చేయాలని ఎలాంటి నిర్లక్ష్యం చూపరాదని జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన 'మనబడి నాడు-నేడు' పనుల పురోగతిపై పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ నాడు-నేడు పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయడానికి అధికారులందరూ సమన్వయంతో కషి చేయాలన్నారు. జిల్లాలో మంజూరైన ఆదనపు తరగతుల పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. సిమెంట్ కొరత లేకుండా రెండు రోజుల్లో ఆయా మండలాలకు సరఫరా కు చర్యలు చేపడతామన్నారు. పనుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తున్న దష్ట్యా, పాఠశాలల సుందరీకరణ, మౌలిక సదుపాయాల కల్పన పనులపై ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. భూ సేకరణలో సమస్యలు వస్తే తన దష్టికి తేవాలన్నారు. జిల్లాలో 740 మరుగుదొడ్లు మంజూరు అయినాయని ఇందులో 34 పూర్తి అయినాయని మిగిలిన వాటిని మే 10వ తేదీ లోగా పూర్తి చేయాలన్నారు. పాఠశాలలు తిరిగి తెరిచేలోగా పనులు పూర్తి చేయాలన్నారు. 740 వంట గదులు మంజూరు కాగా 34 పూర్తి అయినాయని విద్యుత్ సరఫరాకై 750 పనులకు గాను 18 పూర్తి అయినాయని ఇవన్నీ మే 15 లోగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఈ రషీద్ ఖాన్, పంచాయతీరాజ్ ఎస్ఈ గోపాల్ రెడ్డి, ఇరిగేషన్ డిఈ వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికీ రోడ్డు ఏర్పాటు

అనిల్ కుమార్‌కు స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

ప్రజాశక్తి-చిలమత్తూరు(బాగేపల్లి నుంచి)

కర్ణాటక రాష్ట్రంలోని బాగేపల్లి విధానసభ నియోజక వర్గంలో ప్రతి మారుమూల ప్రాంతానికీ రోడ్డు వేసి రాకపోకలు సులభతరం చేస్తానని సిపిఐ(ఎం) అభ్యర్థి డాక్టర్ అనిల్ కుమార్ తెలిపారు. గూళరు హుబ్లీ పరిధిలోని గుర్కుపల్లి, తిమ్మంపల్లి గ్రామ పంచాయతీలో శనివారం ప్రచారం జోరుగా సాగింది. కామ్రేడ్ డాక్టర్ అనిల్ కుమార్‌కి గ్రామస్థులు పూల మాలలు వేసి స్వాగతం పలికారు. అభ్యర్థి ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాగేపల్లి క్షేత్రంలో 145 గ్రామాలకు రోడ్లు లేవని, అనేక గ్రామాలకు కేఎస్ ఆర్టీసీ బస్సులు వెళ్లడం లేదన్నారు. గత 15 ఏళ్లలో జరిగిన అభివద్ధి శూన్యమన్నారు. పదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న సుబ్బారెడ్డి చుట్టపు చూపుగా బాగేపల్లి వస్తుంటారని, ఎన్నికలప్పుడు మాత్రమే గ్రామాలు గుర్తుకొస్తాయన్నారు. అనేక గ్రామాలకు రోడ్డు ఆశ చూపుతూ ఎన్నికల ముందు వంద మీటర్లు వేసి ఎన్నికలు అవగానే పూర్తి చేస్తామని మాయ చేస్తుంటాడని విమర్శించారు. ప్రతి పనిలో 40శాతం కమీషన్ తీసుకొంటాడని, అభివద్ధి చేతగాని ఎమ్మెల్యేకి ప్రజలు ఈ సారి బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, జేడీఎస్‌త, వివిధ ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

మొదలైన రాజకీయ సందడి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలకు సమయం ఆసన్నమవుతోంది. వచ్చే నెలతో వైసిపి పాలన నాలుగేళ్లు పూర్తవనుంది. ఇక మిగిలింది ఆఖరు సంవత్సరమే. దీంతో అప్పుడే రాజకీయ సందడి మొదలైంది. అటు టిడిపి, ఇటు వైసిపి రెండింటిలోనూ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకుల్లో కదలిక మొదలైంది. అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకునేందుకు ఎత్తులు వేస్తున్నారు. అంతక ముునుపు టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పాదయాత్ర జిల్లాలో ముగిసింది. ఇది ముగియగానే సిఎం జగన్ నార్పల మండల కేంద్రంలో నిర్వహించిన వసతి దీవెన పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం జయప్రదం చేయడానికి అధికారులు , ఇటు పార్టీ నాయకులు కష్టపడ్డారు. భారీ జనసమీకరణ చేపట్టారు. ఇక్కడ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం గురించి చెబుతూనే మీరే నా నమ్మకం అంటూ రాబోయే ఎన్నికలను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు చెప్పే మాయమాటలు నమ్మవద్దని చెప్పడం ఒక రకంగా రాజకీయ చర్చకు దారితీసింది. ఇదే సమయంలో వైసిపిలోనూ గ్రూపు తగాదాలు బహిర్గతమవడం చర్చనీయాంశమైంది. శింగనమల ఎస్సి రిజర్వు నియోజకవర్గంలో ఎస్సిలను అణగదొక్కే ప్రయత్నం సాంబశివారెడ్డి చేస్తున్నారని చామలూరు రాజగోపాల్ ఆరోపించారు. ఇది సద్దుమణగక ముందే



యల్లనూరు పోలీసు స్టేషన్ ముందు తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి నిరసనకు దిగారు. దీనికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి స్పందించారు. ఇలా వైసిపిలో గ్రూపు విభేదాలు ఎన్నికలకు ముందు రచ్చకెక్కాయి. ఇది ఇలాగుంటే మాజీ మంత్రి డాక్టర్ శైలజానాథ్‌ని మాజీ ఎంపి జెసి.దివాకర్‌రెడ్డి కలువడం మరో చర్చకు దారితీస్తోంది. టిడిపి బలమైన వ్యక్తుల కోసం అన్వేషణ మొదలు పెట్టిందన్నది చర్చనీయాంశంగా మారింది. ఇక ప్రభుత్వం, అధికారుల తీరుకు వ్యతిరేకంగా జెసి.ప్రభాకర్‌రెడ్డి పురపాలక సంఘం కార్యాలయం వద్ద నిరసన కొనసాగిస్తున్నారు. అక్కడే భోజనం, స్నానాలు, నిద్ర కొనసాగిస్తున్నారు. రాప్తాడులోనూ టిడిపి, వైసిపిల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. అటు టిడిపి, ఇటు వైసిపిలోనూ రాజకీయ సందడి మొదలైంది. ఎన్నికల కోసం నాయకులు సమయత్తమవుతున్నారు. ఏ పార్టీకి ఎటువైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారన్న దానిపై దృష్టి పెట్టారు. పార్టీలు సైతం గెలుపు గుర్రాల కోసం అన్వేషణ మొదలు పెట్టాయి. సర్వేల ద్వారా అభ్యర్థులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నాయి. టిక్కెట్టు అనుమానం ఉన్న వారు పక్క పార్టీల వైపు చూపులు చూస్తున్నట్టు తెలుస్తోంది. వామపక్షాలు ఈ వారంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రచార భేరిన కొనసాగించారు. గ్రామాలు, పట్టణాల్లో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ఈ ప్రచారాన్ని కొనసాగించారు. అనంతపురం నగరంలో జరిగిన బహిరంగ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు బాబురావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రంలో బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. అదే సమయంలో రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్న బిజెపిని టిడిపి, వైసిపిలు ప్రశ్నించలేకపోవడాన్ని నిలదీశారు. ఇలా అన్ని రాజకీయ పార్టీల్లోనూ రాజకీయ సందడి మొదలైందనే చెప్పాలి. ఎన్నికల వాతావరణం అప్పుడే వచ్చేసిందా అన్నట్టుగా ఉంటోంది. ప్రచారాలు, విమర్శలు, ప్రతి విమర్శలు అన్ని వైపుల నుంచి పెరుగుతున్నాయి.

నేరాలు ఘోరాలు

ఆటో బోల్తా.. బాలుడి మృతి

భర్త అజాగ్రత్తే కారణమని భార్య ఫిర్యాదు

పెనుకొండ : ఆటో బోల్తా పడిన సంఘటనలో ఏడేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పెనుకొండ ఎస్ఐ రమేష్ బాబు అందించిన వివరాల మేరకు.. ఆటో డ్రైవర్ దస్తగిరి తన ఆటోలో అనంతపురం నుంచి దానిమ్మకాయలు, ద్రాక్ష అమ్ముకునేందుకు తన ఇద్దరు పిల్లలు ఇర్ఫాన్(7), ఆరిఫ్(7)లతో కలిసి పెనుకొండకు బయల్దేరాడు. ఈ క్రమంలో ఆటో అతి వేగంగా నడపడంతో తిమ్మాపురం క్రాస్‌లో సోలార్ ప్లాంట్ దగ్గర ఇర్ఫాన్(7) ఆటో నుంచి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో దస్తగిరి కొడుకును పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మరణించాడు. దస్తగిరి భార్య అనీషా తన బిడ్డ మరణానికి తన భర్త అతివేగంగా అజాగ్రత్తగా ఆటో నడపడమే కారణం అని ఫిర్యాదు చేసింది. దీంతో దస్తగిరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ...

పుట్టపర్తి అర్బన్ : పట్టణంలోని బస్టాండ్‌లో ఆటో కోసం ఎదురుచూస్తున్న రాజేశ్వరి(59)ని బస్సు ఢీకొనడంతో మృతి చెందింది. ఆమె కుమారుడు పవన్ కుమార్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు.. పట్టణంలోని కుమ్మరపేటకు చెందిన రాజేశ్వరి శనివారం పెనుకొండ వెళ్లి తిరిగి బస్సులో పుట్టపర్తి చేరుకొంది. బస్టాండ్ నుంచి ఇంటికి వెళ్లటానికి ఆటో కోసం ఎదురుచూస్తుండగా ఆర్టీసీ బస్సు వెనుకకూ వస్తూ ఆమెను ఢీకొంది. చికిత్స కోసం సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మతి చెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి తెలిపారు.

బావిలో పడి మహిళ...

లేపాక్షి : మండల పరిధిలోని సిరివరం గ్రామంలో రత్నమ్మ(54) బావిలో పడి మతి చెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రత్నమ్మ, గంగప్ప దంపతులకు ఓ కొడుకు, కుమార్తె ఉన్నారు. కుటుంబ నిర్వహణలో భాగంగా వారి మధ్య గొడవ చోటు చేసుకోగా మూడు రోజులు క్రితం ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. శనివారం సిరివరం గ్రామ సమీపంలోని గంగిరెడ్డి పొలంలో ఉన్న బావిలో శవమై ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం హిందూపురం ఆస్పత్రికి తరలించారు. అలాగే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిలో గుర్తుతెలియని వ్యక్తి...

కదిరి అర్బన్ : కదిరి పట్టణంలోని రాయలసీమ కూడలిలో చావిడి వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్న గుర్తుతెలియని వ్యక్తిని108 వాహనం ద్వారా కదిరి ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మతి చెందినట్లు వైద్యాధికారులు శనివారం తెలిపారు. ఇతడి ఆచూకీ తెలిసినా, ఎవరైనా గుర్తుపట్టినా ఫోన్ నంబర్: 9440796851కు సమాచారం ఇవ్వాలని పట్టణ సీఐ తమ్మిశెట్టి మధు తెలిపారు.

సూపర్ మార్కెట్‌లో చోరీ

చిలమత్తూరు : చిలమత్తూరులోని ఎన్ఎఆర్ సూపర్ మార్కెట్‌లో శుక్రవారం రాత్రి దొంగ చొరబడి నగదు, ఓ సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లాడు. దొంగ సూపర్ మార్కెట్ ముందు ఉన్న సిసి కెమెరాను ధ్వంసం చేశాడు. అలాగే శెట్టర్ డోర్ తాళాన్ని ధ్వంసం చేసి లోపలికి చొరబడి రూ.30 వేల నగదు, ఓ మొబైల్ ఫోన్ ఎత్తుకెళ్లాడు. ఈ ఘటన లోపల ఉన్న సిసి కెమెరాల్లో రికార్డు అయింది. ఉదయం సూపర్ మార్కెట్ తెరిచిన నిర్వాహకుడు అశోక్ చోరీ జరిగినట్లు తెలుసుకొని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

పేకాట జూదరుల అరెస్టు

ముదిగుబ్బ : మండల పరిధిలోని ఎన్ఎస్పి కొట్టాల సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో శనివారం సిబ్బందితో వెళ్లి నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు పట్నం ఎస్ఐ శరత్ చంద్ర తెలిపారు. అలాగే వారి నుంచి రూ. 5,870 నగదు స్వాధీనం చేసుకొని ఒక ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు

సింహ వాహనంపై ఊరేగిన చెన్నకేశవుడు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా లక్ష్మీ చెన్నకేశవస్వామి శనివారం ఉదయం సర్వ భూపాల వాహనంపై, సాయంత్రం సింహ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో ఉన్న లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను ఈ నెల 27 నుంచి మే నెల 7 వరకు ఆలయ ఛైర్మన్ దాశెట్టి సుబ్రహ్మణ్యం, ఈవో వెంకటేశులు, వైస్ ఛైర్మన్ కుండా చౌడయ్య, డైరెక్టర్లు, దాతలు, భక్తుల నడుమ ప్రతిరోజూ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం స్వామివారు సర్వ భూపాల వాహనంపై, సాయంత్రం సింహ వాహనంపై పట్టణ పురవీధులోల ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు కోనేరాచార్యులు, మకరంద బాబు, భానుప్రకాష్, చక్రధర్, గుణ స్వామి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉభయదాతలైన రంగన్న అచ్చప్ప అండ్ సన్స్, జూజారు సత్యప్రభ, సురేష్, రాధ, నీలూరి శ్రీనివాసులు, కుంబర్తి శ్రీధర్, మనీషా, జనదీప్, పుట్లూరు కుళ్లాయప్ప అండ్ సన్స్, అడ్డగిరి గోపాల్, చుక్కలూరు సోలిగాళ్ల నాగమ్మ, ఆంజనేయులు అండ్ సన్స్, కమ్మ శేషన్న జ్ఞాపకార్థం వారి కుమారులు అర్చనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఛైర్మన్ ఆధ్వర్యంలో దాతలను ఘనంగా సత్కరించారు. స్వామివారి అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ ఛైర్మన్, ఈవో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు మే 7వ తేదీ ముగుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్లు జగ్గా జయలక్ష్మి, పోరాళ్ల పద్మావతి, సత్రశాల సత్యనారాయణ, సౌందర్య లహరి సునీత, గిర్రాజు మహాలక్ష్మి, అన్నమయ్య సేవా మండలి పోరాళ్ల పుల్లయ్య, వారి శిష్య బృందం, భక్తులు పాల్గొన్నారు.

జనాలను మోసం చేయడం తగదు

మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం నియోజకవర్గంలో ప్రజలను మోసం చేయాలన్న పద్ధతి మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ అధికార పార్టీ నాయకులను హెచ్చరించారు. ఆయన శనివారం తన వ్యక్తిగత కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2014లో నేను ఎమ్మెల్యే అయిన తరువాత, ఎన్నికలకు ముందు ధర్మవరం పట్టణం, పరిసర గ్రామాల్లో ఇళ్ల స్థలాల కోసం 22 వేల దరఖాస్తు అందాయన్నారు. దీంతో పోతులనాగేపల్లి, కుణుతూరు, రేగాటిపల్లి, మల్లాకాల్వ, గొట్లూరు గ్రామాల సమీపంలో 745 ఎకరాల భూమి సేకరణకు ప్రతిపాదనలు పంపగా అప్పటి సీఎం చంద్రబాబు రూ.23.60కోట్లు మంజూరు చేశారని దాంతో భూసేకరణ చేశామన్నారు. పోతులనాగేపల్లి వద్ద 210 ఎకరాలు భూసేకరణ చేశామన్నారు. అప్పట్లో ఎకరాకు రూ.5లక్షలతో పాటు భూమి ఇచ్చిన రైతులకు ఎకరాకు 5 సెంట్లు ఇస్తామని హామీ ఇచ్చామన్నారు. అహుడా కింద అపార్ట్‌మెంట్ మంజూరు చేయించామన్నారు. అయితే అప్పుడు కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి(ప్రస్తుత ఎమ్మెల్యే), మరికొందరు రైతులకు ఎకరాకు రూ.25 లక్షలు ఇప్పిస్తామని నమ్మబలికి మోసం చేశారన్నారు. పోతులనాగేపల్లి లేఔట్లలో రోడ్డుకు చాలా వరకు బినామీ పేర్లతో వందల కొద్దీ పట్టాలు చేయించుకున్నారని, వాటిని తాము అధికారంలోకి వచ్చాక రద్దు చేసి అర్హులకు ఇస్తామన్నారు. ఇకనైనా జనాలను మభ్యపెట్టాలనే పద్ధతి మానుకోవాలని ఎమ్మెల్యే కేతిరెడ్డిని హెచ్చరించారు. అంతేకాకుండా ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తున్న రూ. 1.80లక్షలు పునాదికే సరిపోతుందన్నారు. ప్రస్తుతం ఉన్న ధరలకు అనుగుణంగా ఇళ్లు కట్టాలంటే తక్కువ అంటే రూ. 6లక్షలు అవుతుందన్నారు. ఇసుక, కంకర ధరలు తగ్గించాలని లేనిపక్షంలో ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతామన్నారు. ఆయనతో పాటు నాయకులు తుంపర్తి పరమేశ్, బోడగల గిరిధర్, పోతుల నాగేపల్లి లక్ష్మీనారాయణ, రాప్తాటి రాము, ముదిగుబ్బ రాజు, నారాయణస్వామి ఉన్నారు.

3లోపు పెన్షనర్లు లైవ్ సర్టిఫికెట్లు అందజేయాలి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పెన్షనర్లు ఏపీసీ లైవ్ సర్టిఫికెట్లను మే 3వ తేదీలోగా ట్రెజరీ కార్యాలయంలో అందజేయాలని పెన్షనర్ల సంఘం తాలూకా అధ్యక్షుడు చలపతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. లేకపోతే పెన్షన్ నిలిపివేస్తారని ఏటీఓ తెలిపారు.